# ఎందరో మహాను"బాబు"లు

ప్రపంచంలో విచిత్రమైన మనుషులు కొందరుంటారు. పొడుగూ, పొట్టీ, లావూ, సన్నం–ఇవే అయితే అదేదో శరీరతత్వం మీద, తిండి మీద ఆధారపడే వుంటాయని మనం అనుకోవచ్చును. మరి–ఈ మనుషులు అలాటివాళ్ళు కారే!... ఈ కోవకు చెందిన వాళ్ళందరికీ లోకాన్ని తినేసే తెలివి తేటలుంటాయి. తిమ్మిని బమ్మి చేసే తిరకాసంతా వీళ్ళలోనే కేంద్రీకరించి వుంటుంది. షార్ట్‌కట్ మెథడ్‌లో సమస్త విశ్వాన్నీ పరిపాలించాలనుకొంటారు. వీళ్ళందరికీ కలిపి ఏం పేరు



పెట్టాలో ఆఖర్ని ఆలోచిద్దాం!...

ప్రస్తుతానికి వస్తే–

బాబుగారి గురించి కొంచెం ముచ్చటించుకోవాలి. ఎందుకంటే ఈ ఆర్టికల్‌కి ఆయనే హార్ట్. బాబుగారి జీవిత చరిత్ర తెలిసికోవడమే ఒక ఎద్యుకేషన్ అంటాడు మా అజాద్. అసలు ఆ బాబుగారు ఎలా వుంటారో చూద్దామని–వారి కొలువు కూటానికి మా బావగారితో ఓసారి వెళ్ళాను. బావగారు బాబుగారికి బాగా తెలును. నా కోరికను మా బావగారు పెడచెవిని పెట్టకపోవటమే ఈ 'కాలమ్' చేసికొన్న అదృష్టం!...

బాబుగార్ని చూశాను.

అటూ యిటూ రెండు ఫోన్లు...

చుట్టూ పరివారం...

నిలబడ్డ వాళ్ళు కొంతమంది... కూర్చున్న వాళ్ళు కొంతమంది...

మంచి హడావుడిగా వుందా సీను.

ఇంతలో ఎవరో వారి దర్శనార్థం వచ్చారు–

"మా వార్షికోత్సవానికి ఈసారి మన్మథరావుగార్ని ఆహ్వానించాం. తమరు సభాపతిగా రావాలి. ఇది మా కోరిక! ..." వచ్చినవారిలో ఒక పెద్ద మనిషి అభ్యర్థించాడు.

తెలుసయ్యా! మన్మథరావుగారు మంచి సినీనటులు. వారం రోజుల క్రితమే ఫోన్లో మాట్లాడారు... మీ ఊరు వాళ్ళెవరో పిలిచారు రమ్మంటారా అని"

"అలాగాండీ..."

"ఫంక్షన్ బాగా నిర్వహిస్తారు. మన వాళ్ళే రండి అని చెప్పాను. సరే మీరున్నారుగా! వస్తున్నానన్నారు"

"థాంక్సండీ!... మీరు అంగీకరించాలి..."

"డైరీ చూడరా..."

డైరీ చూశాడు ఆ ప్రక్కనున్న బాబుగారి మనిషి.

"ఓకే..."

వాళ్ళు ఆనందంతో ఎగిరిగంతేసి అక్కణ్ణుంచి నిష్క్రమించారు.

ఓ గంట గడిచింది–

మరెవరో వచ్చారు.

"అబ్బాయికి డొనేషన్ అడుగుతున్నారు... మీరు కాస్త ఫోన్‌చేసి చెపితే మీకు రుణపడి వుంటాం!..."

"మీరు వెళ్ళి కలవండి. మీ పరిస్థితి వున్నదున్నట్టు మనసు కరిగేలా చెప్పండి. ఇలా నన్ను కలిసినట్టు అక్కడేమీ మీరు నోరు జారకూడదు. నాకు నేనే మీవాడి గురించి పెర్సనల్ ఇంట్రస్ట్ తీసికొన్నట్టు ఫోన్‌లో మాట్లాడతాను." బాబుగారు సమాధానం చెప్పారు.

"అలాగే సర్!..." వాళ్ళు వెళ్ళిపోయారు.

నేనా ప్రక్కనే వున్న బాబుగారి లైబ్రరీని చుట్టి ముట్టి, మళ్ళీ వచ్చి అక్కడే కూర్చున్నాను. ఎంత మందినైనా అలా కూర్చోపెట్టుకోవడం ఆయనకో స్టేటస్ సింబల్!...

వెళ్ళిన గంటకు–తిరిగి వాళ్ళే మళ్ళీ వచ్చారు.

"పని అయిందిసార్! డొనేషన్‌లో చాల రాయితీ ఇచ్చారు. మీరు ఫోన్‌లో మాట్లాడకపోతే ఆ ఉపకారం జరుగుతుందా చెప్పండి... చాల కృతజ్ఞులం!..."

"మంచిది!" బాబుగారు ఎక్కువ మాట్లాడకుండా హుందాగా తల ఊపారు.

వాళ్ళు వెళ్ళిపోయారు.

వాళ్ళు వెళ్ళాక–తన కొడుక్కి సినిమాహాల్లో ఏదైనా ఉద్యోగం చూపించమని ఎవరో ఒక ముసలాయన వచ్చాడు.

"బాబుగారికి ఉపకారమే ఊపిరి" అని ఆనోటా ఈ నోటా విన్న ఆ ఛోటా తండ్రి–బాబుగారి గుణగణాల్ని, జనశ్రుతిలో ఆయనకున్న పేరునీ, ప్రత్యక్షంగా ప్రస్తుతించాడు. దానికి బాబుగారు ఉబ్బితబ్బిబ్బయి–"అలాగే చూద్దాం! మీ కుర్రాడ్ని హాలు యజమానికి కనిపించమను!..." అని ఆ ముసిలాడ్ని–పంపించేశారు. ఆ కుర్రాడికి అలాగే సినిమాహాల్లో బుకింగ్ దగ్గర ఉద్యోగం లభించడం, తండ్రి వెళ్ళి రెండు చేతులా జోడించి బాబుగారికి కృతజ్ఞతలు తెలుపుకోవడం జరిగిపోయింది.

ఆ తర్వాత నా పరిశీలనలో తేలిన విషయాలే విటో మీ ముందుంచుతున్నాను. నాకీ విషయంలో సహకరించిన బాబుగారి పరివారంలో ఒకానొక మిత్రునికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు నివేదించకుండా వుండలేను. మీరు కూడా జాగ్రత్తగా చిత్తగిస్తే ఈ 'కాలమ్' కలకాలం బతుకుతుంది...

1. సినీ నటులు మన్మథరావుగారికి బాబు గారెవరో తెలీదట. అసలు ఆయన ఫోనే చేయలేదట...

2. డొనేషన్ నిమిత్తం బాబుగారు నోరువిప్పి ఫోన్లో ఒక్కమాటకూడా మాటాడలేదట. కుర్రాడి మెరిట్‌నీ, తండ్రి కాళ్ళా వేళ్ళా పడి ప్రాధేయపడటాన్నీ పరిగణలోనికి తీసికొన్న యాజమాన్యమే డొనేషన్ విషయంలో బాగా రాయితీ చూపించిందట...

3. సినిమాహాల్లో ఉద్యోగం గురించి కూడ బాబుగారు ఎవరికీ ఏమీ చెప్పలేదట. బుకింగ్‌లో అనుకోకుండా ఖాళీ ఏర్పడడంతో ఆ కుర్రాడ్ని ఆ నిరుద్యోగం వరించిందట.

ఇవీ బాబుగారి ఎదుగుదలలో చోటు చేసికొన్న షార్ట్‌కట్ సాధనాలు!

పెట్టుబడి లేకుండా పేరు సంపాదించటమంటే మాటలా! దానికి బోల్డెంత నాలెడ్జీ కావాలి. పరిశీలించాలే కాని–ఈ సమాజంలో ఎందరో మహాను"బాబు"లున్నారు. వారందరికీ వందనాలు, వణక్కాలు తప్ప ఇంకేమివ్వగలం?...

—రసరాజు